# విలాసవతి

వసంత ఋతు శోభ ప్రకృతినే కాదు, అందరి మనసుల్ని పులకరింపచేసింది. తంజావూరు ప్రజలు కనులార తిలకించాలని ఉత్సాహంగా ఎదురు చూస్తున్న ఫల్గుణోత్సవం సమీపించింది. రాజగోపాల దేవుని ఉత్సవ నిర్వహణకై విజయరాఘవ నాయకుడు సంసిద్ధుడవుతున్నాడు. శిరసున పచ్చల తురాయి మెరిసింది. వక్షస్థలంపై గోపాలతాళి కదలాడింది. వజ్రాల కర్ణాభరణాలు ధగధగలాడాయి. కెంపుల కడియాలు ఎర్రని కాంతుల్ని ప్రసరిస్తున్నాయి.

శ్రీ రాజగోపాలుడు చెంగమల దేవితో విహగ రాజవాహనుడై రాజవీధిని వేం చేసే సమయానికి విజయరాఘవుడు అంతఃపుర కాంతాజనం వెంటరాగా రాజవీధిని బయలుదేరాడు.

ఆ ఉత్సవాన్ని తిలకించడానికి ఎదురుచూస్తున్న జనులు బారులు తీర్చి నిలబడ్డారు. క్రిక్కిసలాడుతున్నారు. రథం కదులుతుంటే దానివెంట జనం పరుగులు తీస్తున్నారు.

రాజ చంద్రుని కుమార్తె కాంతిమతి ఫల్గుణోత్సవాన్ని చూడాలని తహ తహ లాడుతోంది. ఎప్పటినుంచో స్నేహితులు అలంకరణ పూర్తి చేయటం లేదు... జడలో సంపెంగలు తురిమారు వజ్రాల పాపట బొట్టు తీర్చారు. కస్తూరి తిలకం దిద్దారు ముత్యాల ముక్కర అలంకరించారు.

"అమ్మా – త్వరగా రండి..." కేకపెట్టింది విలాసవతి, కాంతిమతి ఇష్ట సఖి, మెరుపు తీగలాగ వున్న కాంతిమతి చెలులు వెంటరాగా సౌధాగ్రాన్ని చేరింది... శ్రీరాజ గోపాలస్వామి ఊరేగింపది – అమ్మవారి వంక, అయ్యవారి వంక చూస్తూ "గుణవంతుడు, పరాక్రమవంతుడు అయిన చక్కని పతిని ప్రసాదించండి." అంటూ భక్తి శ్రద్ధలతో నమస్కరించింది. కాంతిమతి ఆమె అలా చూస్తుండగానే రథం కదులుతోంది. కళ్ళు ఒక్క క్షణం మిరిమిట్లు గొల్పాయి. ప్రజలందరికీ కనుల పండుగ చేస్తూ విజయరాఘవుడు మన్నారు దేవుని వెంట నడుస్తున్నారు. ఏమి రాజఠీవి, ఏమి సౌందర్యం – కాంతిమతి విజయరాఘవుణ్ణి, రాజగోపాల స్వామిని, అలానే చూస్తోంది... రాజెవరో, దేవుడెవరో, దేవుడెవరో రాజెవరో ఆమె గుర్తించే స్థితి దాటిపోయింది. మైమరచిపోయింది. ఆ విజయరాఘవ రూపాన్ని చూస్తుంటే

దగ్గరే వున్న విలాసవతి, ఆమెను గమనిస్తోంది.

"అమ్మా - వారే విజయరాఘవ నాయకులు" - కాంతిమతి మనసెక్కడో.

"అమ్మా - సరస సంగీత సాహిత్య సార్వభౌములు" - కాంతిమతి చూపెక్కడో.

"వీరేనట మన్నారు దేవుని అవతారమని అందరూ చెప్పకొంటున్నారు"- కాంతిమతికి విలాసవతి మాటలు ఒక్కటూ వినిపించటం లేదు - ఆమె కళ్ళముందు విజయరాఘవుడే - అతని ముఖం చూస్తే చాలదా కన్నుల కరువు తీరిపోవడానికి, అతనితో సంభాషిస్తే చాలదా వాక్కు సఫలమవటానికి, అతనిని కౌగిలిస్తే చాలదా జన్మ ధన్యమవటానికి - అతని పొందు లభించిన వనితే వనిత - సౌధాగ్రం నుండి తిలకిస్తున్న కాంతిమతికి ఉత్సవం అయిపోయిందని విజయరాఘవుడు తన రాజభవనం చేరాడని కూడ తెలియలేదు. అలాగే నిలబడిపోయిన కాంతిమతిని చూస్తూ విలాసవతి భుజంపై చేయి వేసింది. ఉలిక్కిపడిన కాంతిమతి విలాసవతి వెంట అంతఃపురానికి చేరింది.

అప్పటినుంచి కాంతిమతి లోకమే వేరయిపోయింది. అంతఃపురం, దాటి బయటకి ఉద్యానవనానికి కూడ రావటం మానేసింది. ఆమెలో మార్పు విలాసవతి గమనిస్తూనే ఉంది..... ఆ రోజు కాంతిమతి బలవంతంగా నిద్రకుపక్రమించింది..... అంతలోనే స్వప్నం - అందులోను విజయరాఘవుడే - తనతోనే సంభాషిస్తున్నాడు చిరునవ్వులు చిందిస్తున్నాడు. అతని సన్నిధిలో తను పరవశిస్తోంది - కల చెదిరింది. కాంతిమతి పాన్పుపై కూచుంది.

ఒంటరిగా వున్న కాంతిమతిని సమీపించింది విలాసవతి "మీ మనసెందుకు బాగాలేదో నాకు తెలియటం లేదు - మనం వన విహారం, చేద్దాం, జలక్రీడలాడుకుందాం - ప్రకృతి శోభ మనసుకి హాయినిస్తుంది." - 'విలాసవతి మాటలు వింటూ మౌనంగా ఆమె వెంట నడిచింది కాంతిమతి.

స్నేహితురాళ్ళందరూ ఉద్యానవన విహారం చేసారు. జలక్రీడలాడారు... అందరిలో వున్నా కాంతిమతి మనసు విజయ రాఘవునిపై నుండి మరలటం లేదు..... విలాసవతి అంతా ఆశ్చర్యకరంగానే వుంది చూస్తుంటే.

"మన్మథ పూజ చేద్దామా" అంది విలాసవతి కాంతిమతితో కాంతిమతిలో ఒక్కసారి ఉత్సాహం కనిపించింది.

గబగబా తోటలో పూలన్నీ కోసింది విలాసవతి గంధంతో పూపొదరింటిలో అలికి కస్తూరితో ముగ్గులు పెట్టింది..... రతి మన్మధుల చిత్రాలు, వసంతుడు, చంద్రుడు, మలయానిలుడు సేవిస్తున్నట్లుగా అక్కడ తీర్చి దిద్దింది. పసుపు కుంకుమ, పండ్లు పూలు అన్ని అమర్చింది. కాంతిమతి చేత మన్మధపూజ చేయించి నైవేద్యాలు పెట్టించింది. విలాసవతి 'విజయ రాఘవేంద్రుని, నన్ను జత గూర్చుమంటూ భక్తితో

మన్మథుని పూజించి నమస్కరించింది కాంతిమతి భక్తి శ్రద్ధలతో.

విలాసవతికి విషయమర్ధమవటం లేదు. ఈ కాంతిమతి మనసులో నిలచిందెవరూ, "ఈ విషయం తెలిస్తే కదా తను సహకరించేది!!

మన్మథపూజ జరిపినా, కాంతిమతికి మన్మథతాపం పెరిగింది కానీ తరగలేదు.

అమ్మా తమ మనసేమిటో తెలుస్తే" - విలాసవతి కాంతిమతి తలలో పువ్వులు తురిమింది..... కాంతిమతి శూన్యంగా ఎటో చూస్తోంది. "చెప్పండి, నా దగ్గర దాపరికమా.....మీకు ఏ సహాయమైనా చేస్తాను - ఆ విజయ రాఘవుణ్ణి తెచ్చి పెళ్ళి చెయ్యమన్నా చేస్తాను." - నవ్వుతూ విలాసవతి అంటుంటే కాంతిమతి గుండె ఝల్లుమంది మనసులో కోరిక, తన స్వప్నం ఈ విలాసవతికి తెలిసిపోయాయా అని ఆశ్చర్యమేసింది. "నిజంగానా - అయితే విను ఆనాడు సౌధాగ్రసీమ నుండి విజయ రాఘవుణ్ణి చూసాక నా మనసు మనసులో లేదు.... అతనిని పరిణయమాడక పోతే నాజన్మే వృధా" - కళ్ళలో నీటి పొరలు కమ్ముతుంటే గొంతు గద్గదికమవుతుంటే స్నేహితురాలి దీన స్థితికి కారణం తెలిసిపోయింది.

"మీరు అనుమతించండి - నేను స్వయంగా ఆ రాజభవనానికి వెళ్ళి మీ మనసులోని కోర్కె రాజుకి విన్నవిస్తాను - మీ సౌందర్యాన్ని వర్ణిస్తాను... మీ విరహాన్ని విన్నవిస్తాను -

"నిజంగానా, విలాసవతీ, ఇది నిజంగా చేయగలవా, రాజభవనానికి వెడతావా" - కాంతిమతి కళ్ళనిండా వెలుగు -

"నిజంగా వెడతాను, రాజు దగ్గర ప్రజలు కష్టాలు చెప్పుకోరా" - నవ్వింది విలాసవతి కళ్ళు తిప్పుతూ.

"ఆ చెంగమల దేవిని రాజగోపాల స్వామిని నమ్ముకోండి... నే నుండగా మీకీ బేలతనమేమిటి" కాంతిమతి నుదుట కస్తూరి తిలకం దిద్ది, బయలు దేరింది విలాసవతి ధైర్యంగా.

విలాసవతి బయలు దేరాక, కాంతిమతి మనసు పరిపరి విధాల పోయింది. రాజకుమార్తె అయిన తానే రాజును వివాహమాడతానని రాయబారం పంపటమా, ఈ విషయం తండ్రికి తెలిస్తే అతను కోపగిస్తాడో, ఏమో, ఆ విజయ రాఘవుడు తను పంపిన రాయబారిని అగౌరవం చేసి వెనక్కి పంపిస్తే - ఏమన్నాకానీ విలాసవతి అన్నిపనులు చక్క దిద్దగలదు! -కాంతిమతి చెంగమల దేవికి మనసులో నమస్కరించింది.

అప్పుడే మన్నారు దేవుని దర్శించి పల్లకిలో వచ్చిన విజయరాఘవుని చూస్తూ,

అంత త్వరలో దర్శనభాగ్యం కలిగినందుకు పొంగిపోయింది విలాసవతి.

రాజాస్థానంలో ప్రవేశించి, తలవంచి నుంచున్న విలాసవతి వంక చూస్తూ చిరునవ్వు నవ్వాడు విజయ రాఘువుడు త్వరగా తను ఏపని మీద వచ్చిందో చెప్పి, ఆనాడు సౌధాగ్రసీమనుండి తిలకించిన కాంతిమతి తనను ఇక్కడికి పంపిందని చెప్పింది. ఆమాటలు వింటున్న విజయ రాఘువుని మనసు ఆనందంతో నిండిపోయింది. ఆ రాజకుమార్తె తనను వరించి, విరహంలో కొట్టు మిట్టాడుతోందా అనుకుంటూ విలాసవతి వంక చూసాడు..... కాంతిమతి సౌందర్యాన్ని వర్ణించి రాజు మాటకోసం ఎదురు చూస్తున్నట్టు నుంచుంది. విలాసవతి..." నీవే ఆమెకు తగిన వరునివి. ఆమె నీకు తగిన రాజకన్య, మరి రాజగోపాల స్వామి దయ ఏమిటో, అంది చివరగా

విజయరాఘువుడు విలాసవతివైపు తిరిగి "మీ రాజకుమార్తె కోరిక తీరినట్టే, నీ రాయబారం ఫలవంతమైనట్టే –" అంటూ దగ్గరున్న పరిచారకుల వైపు చూసాడు.

విలాసవతికి కర్పూర తాంబూలం, విలువగల ఆభరణాలు పట్టు వస్త్రాలు సమర్పించి సన్మానించాడు విజయరాఘువుడు.

విలాసవతి ఆనందానికి హద్దులులేవు. తన స్నేహితురాలు కాంతిమతిని విజయరాఘువుడు పరిణయమాడతాడు. – ఒక్క నిముషం నిలిచింది. విలాసవతి అక్కడ విజయరాఘువుణ్ణి సమీపించి నెమ్మదిగా, "నాదో విన్నపం, మన్నించాలి తమరు – కాంతిమతి పంపితే నేను మీ దగ్గరకొచ్చిన విషయం ఆమె తండ్రి రాజచంద్రునికి తెలియనీయద్దు, మీరే మీ మంత్రులను రాజచంద్రుని వద్దకు పంపండి సవినయంగా మనవి చేస్తుంటే, మా శతక్రతు శ్రీనివాసకాకాచార్యుల వారిని రాయబారిగా పంపి మీ చెలిని పరిణయ మాడతాను – అంతేనా" – విజయ రాఘువుడి వద్ద సెలవు తీసుకు బయలు దేరింది. విలాసవతి విజయగర్వంతో.

ఇంత విజయవంతంగా కార్యనిర్వహణ చేసిన స్నేహితురాలు విలాసవతి వంక చూస్తూ ఆనంద భాష్పాలు అద్దుకుంది కాంతిమతి.

కాంతి మతికి పెళ్ళికూతురి అలంకరణ ఎలా చేయాలా అనుకుంటూ కాంతిమతీ విజయరాఘువుల కల్యాణవైభవాన్ని ఊహించుకుంటూ, అడుగులో అడుగు వేసుకొంటూ కదిలిపోయింది విలాసవతి.